
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.8। కనిష్ఠం 24.7



ఆదిలాబాద్
జిల్లా వార్తలు

సోమవారం 14 జూలై 2025



కొత్తనీరుతో నిండిన మత్తడి వాగు ప్రాజెక్టు

నిండుకుండలా మత్తడి వాగు

● పూర్తిస్థాయి నీటిమట్టానికి ప్రాజెక్టు

తాంసి, జూలై 13(ఆంధ్రజ్యోతి): మత్తడి వాగు ప్రాజెక్టుకు అప్పుడే జలకల వచ్చింది. నిన్న మొన్నటి వరకు ఎడారిని తలపించిన ఈ ప్రాజెక్టుకు ఒక్కసారిగా భారీగా వరద నీరు వచ్చింది. దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలోకి చేరుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా.. ఆదివారం మధ్యాహ్నానికి 276.20 మీటర్లకు చేరుకుంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 20 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. గత ఐదు రోజుల క్రితం ఐదు గేట్లు ఎత్తివేసి 1600 క్యూసెక్కుల నీటిని బయటకు వదిలారు. అంతేకాకుండా ప్రస్తుతం ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తుంది. అంతర్ రాష్ట్ర రహదారికి అనుకొని ఈ ప్రాజెక్టు ఉండటంతో వచ్చి పోయేవారు కొద్దిసేపు ప్రాజెక్టు వద్ద సేదతీరి వెళుతున్నారు. వర్షాకాలం ఆరంభంలోనే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ప్రాజెక్టు పరిస్థితి ఇంకా ఎలా ఉంటుందో? అని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం మీద ప్రాజెక్టు మూడు, నాలుగు పెద్ద వర్షాలకు పూర్తిస్థాయికి చేరుకోవడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.



● ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగిన మద్యం డిపో

- జిల్లాలోని ఉట్నూర్ ఎక్స్ రోడ్డులో 1986లో ఏర్పాటు
- బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో డిపో
- 2021లో భారీ అగ్ని ప్రమాదం
- కోట్ల రూపాయల డిపో.. ప్రైవేట్ గోదాంకు
- ఉపాధి కోల్పోయిన వందలాది మంది కార్మికులు

పునరుద్ధరణకు నోచుకోని.. మద్యం డిపో

ఉట్నూర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని మద్యం షాపుల కు మద్యం సరఫరా చేసే ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులోని మద్యం డిపో పునరుద్ధరణకు నోచుకోవడం లేదని ఏజెన్సీ ప్రాంత ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగేళ్ల క్రితం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో ఉట్నూర్ మండలంలోని లింగోజి తండా ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న మద్యం డిపోను జిల్లాకేంద్రంలోని ప్రైవేట్ వ్యక్తుల గిడ్డంగికి మార్చారు. ఈ అగ్ని ప్రమాదంలో రూ.వంద కోట్ల మేర నష్టం ప్రభుత్వానికి వాటిల్లింది. ఉమ్మడి జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు ఉట్నూర్ మండలంలోని ఎక్స్‌రోడ్ వద్ద ఉన్న మద్యం డిపో నుంచి మద్యం సరఫరా అయ్యేది. నాలుగేళ్ల క్రితం అగ్నిప్రమాదం జరిగినా.. తిరిగి డిపో పునరుద్ధరణ కోసం అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు అంటున్నారు.

నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు



ఉట్నూర్ మండలంలోని ఎక్స్‌రోడ్ వద్ద 1986లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వారుణి వాహిణి (సారా) తయారు చేయడానికి ఏర్పాటు చేశారు. ఆ రోజులలో ఉట్నూర్ ఎక్స్ రోడ్డు డిపో నుంచి ఉమ్మడి జిల్లాలో సారా సరఫరా చేసే వారు. ఆ తర్వాత ప్రభుత్వాలు సారాను పూర్తిగా నిషేధించడంతో సారా సరఫరా చేసే పరిశ్రమను మద్యం డిపో కోసం వినియోగించారు. ఈ



ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులోని బేవరేజ్ కార్పొరేషన్ ఐఎంఎల్ డిపో

డిపో పరిధి లో ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాలోని ఇచ్చోడ, కాగజ్‌నగర్, ఆదిలాబాద్, ఉట్నూర్, నిర్మల్, భైంసా ఏడు సర్కిళ్ల పరిధిలోని 250 వైన్ షాపులు, బార్ షాపులలో మద్యం విక్రయించేలా ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు మద్యం డిపో నుంచి మద్యం సరఫరా చేసేవారు. ప్రతి నెలా సుమారు రూ.వంద కోట్ల మేర మద్యం వ్యాపారం ఈ డిపో నుంచి జరిగేది. డిపో ద్వారా ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం వచ్చేది.

కోట్ల రూపాయలు ప్రైవేట్ గోదాంకు..

ఉట్నూర్ ఎక్స్ రోడ్డులోని మద్యం డిపోలో 21 అక్టోబరు 2021లో భారీ అగ్ని ప్రమాదం సంభవించడంతో కోట్ల రూపాయల ఆస్తి నష్టంతో పాటు మద్యం దగ్ధం అయ్యింది. డిపో నిర్వహణలో అప్పటి అధికారుల నిర్లక్ష్యం, నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన భవనంలో అస్తవ్యస్తంగా ఉన్న కరెంట్ సరఫరాను కార్మికులు హెచ్చరించినా.. పట్టించుకోక పోవడంతో షార్ట్ సర్క్యూట్ సంభవించి భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. దీంతో కోట్ల రూపాయల మద్యం నిలువలు అగ్నికి ఆహుతి అయ్యాయి. అప్పటి నుంచి ఉట్నూర్ మండంలోని మద్యం గోదామును జిల్లా కేంద్రంలోని ప్రైవేటు గోదాములో ప్రతీనెల రూ.4.70 లక్షలు చెల్లిస్తూ అక్కడ నిర్వహిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి

(తరువాయి 6వ పేజీలో...)

మద్యం డిపోతో కార్మికులకు ఉపాధి
: జాదవ్ హరినాయక్, మాజీ సర్పంచ్, లింగోజితండా



ఉట్నూర్ ఎక్స్ రోడ్డు(లింగోజితండా) వద్ద నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన మద్యం డిపోతో ఈ ప్రాంతానికి కళ వచ్చింది. డిపోలో పని చేసే కార్మికులు, ఉద్యోగుల సందడితో వ్యాపారస్తులకు ఎంతో లాభం ఉండేది. మద్యం డిపో లేకపోవడం వల్ల గ్రామ పంచాయతీకి సైతం ఆదాయం తగ్గింది.

డిపోను సత్వరమే పునరుద్ధరించాలి
: లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు, కార్మిక సంఘం, ఉట్నూర్



ఉట్నూర్ ఎక్స్ రోడ్డులో నాలుగు దశాబ్దాల నుంచి ఉన్న మద్యం డిపోను ప్రభుత్వం తిరిగి పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ప్రాంతంలోని కార్మికులకు, స్థానికులకు ఉపాధి లభిస్తుంది. ఈ మేరకు స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.



బోనాల జాతరలో పెద్దసంఖ్యలో పాల్గొన్న మహిళలు

ఘనంగా పోచమ్మ బోనాల జాతర



పోతరాజులతో కలిసి నృత్యాలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మొదటిసారి కొట్టాల పోచమ్మ బోనాల జాతరను నిర్వహించారు. జాతర ఘనంగా జరిపేందుకు ఆలయ కమిటీ వారు గత నెల రోజుల నుంచి తీవ్రంగా కృషి చేస్తున్నారు. అయితే ముందుగా ప్రకటించిన విధంగా ఆదివారం బోనాల జాతర నిర్వహించారు. మండల కేంద్రంలోని మహిళలు బోనాలు ఎత్తుకొని ఆలయానికి చేరుకున్నారు. పోతరాజులు ముత్యాలు చేయగా అంగరంగ వైభవంగా బోనాల జాతర జరిగింది. స్థానిక ఎమ్మెల్యే జాదవ్ అనిల్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గజేందర్ పాల్గొన్నారు. మొదటి బోనాన్ని పాలకవర్గ సభ్యుడు మెరుగు భోజన్న మొదటి బోనాన్ని సమర్పించారు. కన్నుల పండుగగా నిర్వహించారు.

అభాగ్యులకు ఎమ్మెల్యే చేయూత

ఉట్నూర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అభాగ్యులకు ఆపన్నహస్తం అందిస్తున్నారు. ఆదిలాబాద్ రాంనగర్ కాలనీకి చెందిన కుమ్ర సుజాత ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ను కలిశారు. తన బాబుకు పాల కోసం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తనవంతుగా రూ.ఐదు వేలు ఆర్థిక సహాయాన్ని అందించి, మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని మత్తడిగూడ గ్రామానికి చెందిన సిడాం జ్యోతి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్‌ని కలిసి తమ గోడును వినిపించారు. స్పందించిన ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులకు ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వెడ్మ ఫౌండేషన్ వైస్ చైర్మన్ కోరెంగ అక్షయ్, తదితరులున్నారు.



కలగా డబుల్ ఇళ్ల నిర్మాణం

- రుయ్యాడిలో 10 ఏళ్లుగా పిల్లర్లకే పరిమితం
- అయినా.. పట్టించుకోని అధికారులు

7లో



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పాయల

భక్తిశ్రద్ధలతో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ

ఆదిలాబాద్ అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): బేల మండల కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల శంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోచమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, కాలనీలో అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఇందులో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి : వైద్యాధికారి

నార్నూర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో రోగాలు బారిన పడకుండా ఈ ప్రాంతవాసుల కోసం మంగళవారం టెలిమెడిసన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వాస్పత్రిలో నిర్వహించనున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ జితేందర్ రెడ్డి అన్నారు. జిల్లా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని, దీని ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. గర్భిణులు, అసంక్రమిత వ్యాధులు, కంటి, ఇతర సమస్యలతో బాధపడేవారు ఈ శిబిరానికి వచ్చి వైద్యం చేయించుకోవాలని కోరారు. జనరల్, గుండె, స్త్రీ జననేంద్రియ, కంటి, టీబీ, ఇతర వైద్యులు వస్తున్నట్లుగా తెలిపారు.

'బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి'

బోథ్, జూలై 13(ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని, అందులో భాగంగానే 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తోందని పార్టీ సీనియర్ నాయకులు గాజుల పోతన్న, బత్తుల రమేష్‌లు పేర్కొన్నారు. ఆదివారం సోనాల మండల కేంద్రంలో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడాన్ని హర్షిస్తూ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ బీసీలు రాజకీయాల్లో, అన్ని రంగాల్లో ముందు ఉంటారన్నారు. ఇందులో పీఏసీఎస్ డైరెక్టర్ పోశెట్టి, బీసీ సెల్ అధ్యక్షుడు జంగాల భోజన్న, అమృత రావ్, చెక్కపల్లి చింతపల్లి సుధీర్, అనిల్, ఆత్మ డైరెక్టర్ శ్రీధర్ ముండే మాజీ సర్పంచ్ రామ్దాస్ రాజేష్, జ్ఞానేశ్వర్, మెరుగు మహేష్, తదితరులు పాల్గొన్నారు.



సోనాలలో క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు

● రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ● సుంకిడిలో ఘనంగా బోనాల పండుగ ● హాజరైన ఎంపీ, బోథ్ ఎమ్మెల్యేలు



సుంకిడిలో బోనం ఎత్తుకున్న మంత్రి వివేక్



.. బోనాలతో బయలుదేరిన గ్రామస్థులు



తాంసిలో బోనాలతో మహిళలు



గుడిహత్నూర్‌లో పోచమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

తలమడుగు, జూలై 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం మండలంలోని సుంకిడి గ్రామంలో అంతా కలిసి ఒకేరోజు బోనాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఉద్యోగ, ఉపాధి రీత్యా వివిధ వివిధ ప్రాంతాలకు వెళ్లినప్పటికీ.. పండుగకు గ్రామనికి రావడం ఎంతో ఆనందకరమన్నారు. అనంతరం పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో ఎంపీ నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ జడ్పీటీసీ గణేష్ రెడ్డి, కాంగ్రెస్ నియోజవర్గ ఇన్‌చార్జిలు ఆడే గజేందర్, కంది శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ వెంకటేష్, మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని ఎక్స్ రోడ్డు, హనుమాన్ నగర్ కాలనీ వాసులు ఆదివారం అకాడి బోనాల పండుగను భక్తిశ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలతో పోచమ్మ ఆలయానికి చేరుకుని గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ప్రత్యేక పూజలు చేసి కోళ్ళ, నైవేద్యం అమ్మవారికి సమర్పించి చల్లగా చూడాలని మొక్కులు తీర్చుకున్నారు.

తాంసి: అకాడి బోనాలను ఆదివారం అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. శ్రావణమాసం కంటే ముందు నిర్వహించే ఈ బోనాలను ప్రతీయేడు ఇదే రీతిలో సమర్పిస్తారు. ఇందులో భాగంగా ఆదివారం మండలంలోని ఆయా గ్రామాలలో ఉదయం నుంచే మహిళలు బోనాలు వేసేందుకు బారులు తీరారు. ఒకరోజు ముందుగా గ్రామ దేవతలను జలాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. కుండలకు రంగురంగుల ముగ్గులు వేసి అలంకరించి ఆ కుండలను వేపాకులతో నెత్తిన పెట్టుకొని బోనాలు సమర్పించారు. తాంసి, కప్పర్ల, హస్నాపూర్, మండల నాగపూర్, జామిడి, పొన్నారి, తదితర గ్రామాలలో బోనాలు సమర్పించారు. బోనాల సందర్భంగా గ్రామాలు సందడిగా కనిపించాయి.

ఆదివాసీలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

● కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్ అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు రాష్ట్ర ప్రభుత్వం ఎళ్లప్పుడుఅండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం కలెక్టర్‌చౌక్ సమీపంలో ఆదివాసీ భవన నిర్మాణానికి ఆయన డీసీసీబీ చైర్మన్ అడ్డిభోజారెడ్డి, మాజీ ఎంపీ సోయంబాపురావులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి మంజూరైన ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా ఈ భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరగా భవన నిర్మాణం పూర్తి చేసేలా కృషి చేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులిచ్చి ప్రోత్సహిస్తున్న ప్రభుత్వానికి, మంజూరులో కృషి చేస్తున్న మంత్రి సీతక్క, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారంతో నియోజకవర్గానికి మరిన్ని నిధులు తీసుకు రావడంలో తమవంతు ప్రయత్నం చేస్తామన్నారు. ఇందులో నాయకులు గిమ్మ సంతోష్, బాలూరి గోవర్ధన్‌రెడ్డి, సెడ్మకి ఆనందరావు, కొడప సోనేరావు, మడావి రాజు, సిడాం రాంకిషన్, చిత్రు పటేల్, గంటుబాయి, రాజేశ్వర్, రఫీక్, తదితరులు పాల్గొన్నారు.

● బీఆర్ఎస్, బీజేపీలు ప్రజలకు చేసేందేమీ లేదు

ఆదిలాబాద్ అర్బన్: గత పదేళ్లు పాలించిన బీఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లి ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రజాసేవా భవన్‌లో జైనథ్ మండలం నిరాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పట్టణంలోని 13వ, 34వ వార్డు నుంచి ప్రజలు భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కంది శ్రీనివాస్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఓటమితో రాజకీయంగా మాజీ మంత్రి జోగు రామన్న పని అయిపోయిందని జోస్యం చెప్పారు. ఎమ్మెల్యే పాయల శంకర్ ఎలాంటి వ్యక్తి అనేది అందరికీ తెలుసని, ఆయనపై పలు ఆరోపణలు చేశారు. అంతేకాకుండా జోగు రామన్న, పాయల శంకర్‌లు వారి కుటుంబం గురించి ఆలోచిస్తారు, తప్పితే ప్రజలకు చేసిందేమీ లేదని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో నియోజక వర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిందని, కొత్త రేషన్ కార్డులు అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టబోతుందని పేర్కొన్నారు. గత పదేళ్లుగా రేషన్‌కార్డుల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసినా ప్రయోజనం లేక పోయిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో 42 శాతం అమలుకు ప్రత్యేక ఆర్డినెన్స్ తెచ్చి గవర్నర్ ఆమోదం కోసం పంపించిందన్నారు.బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూశాయని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి కట్టుగా అభ్యర్థుల విజయం కోసం శ్రమిద్దామని పిలుపునిచ్చారు. ఇందులో నాయకులు గిమ్మ సంతోష్, మునిగెల నర్సింగ్, మునిగెల విఠల్, లోక ప్రవీణ్ రెడ్డి, కలాల శ్రీనివాస్, సందా నర్సింగ్, రామ్ కుమార్, దాసరి ఆశన్న, అల్చెట్టి నాగన్న, రమేష్, రఫీక్, ఖయ్యూం, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో కాంగ్రెస్ నాయకులు



ఆదివాసీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

మహోన్నతమైన వ్యక్తి అంబేద్కర్

● రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ● ఘనంగా విగ్రహావిష్కరణ ● తలమడుగు, నార్నూర్ మండలాల్లో పర్యటన



తలమడుగులో అంబేద్కర్ నూతన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వివేక్, ఎంపీ, ఎమ్మెల్యేలు



హాజరైన నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు

తలమడుగు, జూలై 13(ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల ఆశాజ్యోతి మహోన్నతమైన వ్యక్తి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతీఒక్కరు పాటుపడాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రంలో తలమడుగు గ్రామానికి చెందిన వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్త కాటిపెటి వసంత రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ నగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, అంబేద్కర్ సంఘం నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ ఆశ సాధన కోసం ప్రతీ ఒక్కరు పాటు పడాలన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణంతోనే నేడు ప్రతీ ఒక్కరికి సంక్షేమ అభివృద్ధి పథకాలు అందుతాయన్నారు. అంతేకాకుండా ఆయన రచించిన రాజ్యాంగంతోనే ఆర్టికల్ 3 ప్రకారం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతుందని ప్రతీఒక్కరికి ఆరు స్కీంలతో పథకాలను అందిస్తున్నామన్నారు. తన తండ్రి గారు కేంద్ర మంత్రి వెంకటస్వామి ఆశయ సాధన కోసం తాను చెప్పిన మార్గంలో సంపాదించిన దాంట్లో కొంత పేద ప్రజల కోసం మంచి కార్యక్రమాల కోసం ఉపయోగించాలని సూచించారు. తలమడుగుకు చెందిన వసంత్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డిలు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మహోన్నత వ్యక్తి అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. తాను ఇప్పటివరకు 200 విగ్రహాలను ఆవిష్కరించినప్పటికీ ఇలాంటి మంచి వాతావరణం ఎన్నడు చూడలేదన్నారు. అనంతరం స్థానికంగా నెలకొన్న సమస్యలను మంత్రికి విన్నవించగా.. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తలమడుగు గుట్టకు రోడ్డు నిర్మాణ హైలెవెల్ వంతలను నిర్మాణం. ఫంక్షన్ హాల్ నిర్మాణం తహసీల్దార్ ఎంపీడీవో కార్యాలయం నిర్మాణం ఆసుపత్రికి ప్రహరీ గోడ నిర్మాణం ఇతర సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో ఎంపీ నగేష్ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే బోజు పటేల్, బోథ్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, అదిలాబాద్ నియోజకవర్గ కంది శ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడి బోజ రెడ్డి, మాజీ జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్యాణ్ రాజేశ్వర్, మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ , తలమడుగు సంఘం అధ్యక్షులు దేవన్న, విగ్రహ దాతలు కాటిపల్లి వసంత్ రెడ్డి, కాటిపెల్లి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, కన్వీనర్ తోట వెంకటేష్ మాదిగ సంఘం జిల్లా అధ్యక్షులు, ఉపాధ్యక్షుడు, తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో శంకర్, తదితరులు పాల్గొన్నారు.

● కొలాబ్ధరి, ఎంపల్లి ప్రాజెక్ట్ మంజూరుకు కృషి

నార్నూర్: కొన్నేళ్ల నుంచి ప్రాంత ప్రజలు సాగు నీటి డిమాండ్ అయిన కొలాబ్ధరి, ఎంపల్లి ప్రాజెక్ట్ మంజూరు కోసం ఎన్నో ఎలా పోరాటం జరుగుతున్నాయని, ఈ ప్రాంత అభివృద్ధికి కీలకమైన అంశం కాబట్టి కచ్చితంగా సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి వాటి మంజూరుకు కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక ఉపాధి శిక్షణ, కర్మాగారాల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం మండల పర్యటనకు వచ్చిన మంత్రిను స్థానిక మాజీ సర్పంచ్ బి.గజానంద్ నాయక్ స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రితో కలిసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం త్రిరత్న బుద్ధ విహార్‌లో గౌతమ బుద్ధుని ప్రతిమకు పూజలు చేశారు. అనంతరం యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పరమేశ్వర్ కొలెక్కర్ ఏజెన్సీలో ఎదుర్కొంటున్న సమస్యలు విన్నవించారు. ఏజెన్సీలో సాగు చేసుకుంటున్నా భూములకు పహాణీలు ఇవ్వాలని, మెరుగైన విద్య కోసం ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఉపయోగపడే దాదాపుగా రూ.2 కోట్ల వ్యయంతో అంబేద్కర్ భవనం, బంజారా భవనం, షాదీఖానా వంటి భవనాలు మంజూరు చేయాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. ప్రాంత సమస్యలు విన్న మంత్రి సానుకూలంగా స్పందించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తనవంతు సహకారం చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, తహసీల్దార్ జడి రాజా లింగు, నియోజక వర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాం నాయక్, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, పాక్స్ ఇన్‌చార్జి చైర్మన్ ఆడె సురేష్, దళిత రత్న అవార్డు గ్రహీత నర్సింగ్ మోరే, దేవు రావు లోకండే,దుర్గే కాంతారావు, కేశవ్ దుర్గే, షేక్ దాదే అల్లి ఫిరోజ్ ఖాన్, సయ్యద్ కాశిం, విలాస్ బానోత్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముబ్బసిర్, షేక్ మొహమ్మద్, దస్తగిర్, చాలుకర్ ప్రకాష్, కరింఖాన్ చంద్ర శేఖర్ ఉన్నారు.



నార్నూర్‌లో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిను సన్మానిస్తున్న బి.గజానంద్ నాయక్, గ్రామస్థులు

పునరుద్ధరణకు నోచుకోని.. మద్యం డిపో

(5వ పేజీ తరువాయి...)

కోట్లాది రూపాయల అదనపు భారం భరించాల్సి వస్తుంది. అధికార యంత్రాంగం మద్యం డిపో పునరుద్ధరించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా.. ఆమోదం లభించక పోవడంతో జిల్లా కేంద్రంలోని అద్దె భవనంలో గోదామును కొనసాగిస్తూ వస్తున్నారు.

ఉపాధి కోల్పోయిన స్థానికులు

ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులో మద్యం డిపో ఉండడం ద్వారా ఈ ప్రాంతంలోని హోటళ్లు, చిరు వ్యాపారులకు గిరాకీ ఉండడంతో పాటు మరికొంత మందికి ఉపాధి లభించేది. డిపోలో పని చేసే వంద మంది కార్మికులు, ఉద్యోగులతో పాటు ఆయా ప్రాంతాల నుంచి మద్యం తీసుకువచ్చే లారీ డ్రైవర్లు క్లీనర్లతో సందడిగా కనిపించేది. డిపోలో పని చేసే కార్మికులు సైతం ఏజెన్సీ ప్రాంతం నుంచి ప్రతీరోజు జిల్లా కేంద్రానికి వెళ్లి మద్యం డిపోలో పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడడంతో ఆర్థికంగా నష్టపోతున్నామ ని కార్మికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులో మద్యం డిపోను పునరుద్ధరించాలని గిరిజన ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒకరి మృతి



పెండల్‌వాడలో మృతి చెందిన భావనే అశోక్

జైనథ్, జూలై 13(ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్ పరిధిలోని పెండల్‌వాడ గ్రామంలో శనివారం రాత్రి కూలర్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భావనే అశోక్(56) మృతి చెందిన సంఘటన పెండల్‌వాడలో తీవ్ర విషాధాన్ని నింపింది. జైనథ్ మండల పోలీసులు,కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... మృతుడి కొడుకు రవి, ఆయన భార్య, తల్లి ఒకే కుటుంబంలో శనివారం రాత్రి అన్నం తిని పండుకున్నారు. బావానే అశోక్ ఎప్పటిలాగే ఇంటి ముందు గదిలో నిద్రించాడు. రాత్రి 12గంటల ప్రాంతంలో నిద్రమత్తులో మంచంపై నుంచి కూడి కాలు ఎదురుగా ఉన్న కూలర్‌పై పడడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడాని తెలిపారు. మృతుడు అశోక్ వ్యవసాయంతో పాటు కూలి పని చేస్తూ జీవనం కొనసాగించే వాడని తెలిపారు. కూలర్‌తో మృతి చెందిన సంఘటన పెండల్‌వాడ గ్రామంలో తీవ్ర విషాదం నింపింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జైనథ్ మండల ఎస్సై గౌతంనాయక్, ఏఎస్సై ఆత్మారాంలు పెండల్‌వాడ గ్రామానికి చేరుకుని ఆదివారం శవ పంచనామా నిర్వహించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని మార్చురి గదికి తరలించారు. దీని పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గౌతం నాయక్ పేర్కొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

బజార్‌హత్నూర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సింగిల్ విండో చైర్మన్ చట్ల గజ్జయ్య ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో బంధుమిత్రుల నడుమ జరిగాయి. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్, బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌లు స్థానిక నాయకులతో కలిసి బజార్‌హత్నూర్‌లో నిర్వహించిన ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. దుఖంలో ఉన్న వారి కుటుంబ సభ్యులను వారు ఓదార్చి ధైర్యం చెప్పారు. గజ్జయ్యతో తమకున్న అనుబంధాన్ని,అప్యాయ తలను గుర్తు చేసుకున్నారు. చట్టగజ్జయ్య కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. వీరితో పాటు మాజీ జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, బోథ్ నియోజక వర్గం, బజార్‌హత్నూర్ మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం

● చెక్కులను అందజేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, జూలై 13(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం కోసమే ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించడం జరిగిందని బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయన నివాసలో ఇచ్చోడ మండలంలోని వడ్డర్‌గూడ గ్రామానికి చెందిన లునుంబాయికి మంజూరు అయిన రూ.35 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలు అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందితే ఆ బిల్లులను తమ దగ్గర సమర్పించి సీఎంఆర్ఎఫ్ అందుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నేరడిగొండలో చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



మాదాపూర్ గ్రామస్థులకు మంజూరు పత్రాలు అందజేస్తూ..

● ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరు

నేరడిగొండ/బోథ్: నేరడిగొండ మండలంలోని మాదాపూర్ గ్రామంలో గల అభయాంజనేయ స్వామి ఆలయానికి మొదటి దశలో రూ.25 లక్షలు, బోథ్ మండలం కౌట(బి) గ్రామంలో గల మల్లికార్జున స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.20లక్షలు నిధులు మంజూరు చేయించారు. కాగా ఆదివారం నేరడిగొండలో గ్రామస్థులకు ప్రొసీడింగ్ కాపీని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్థులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరుకు తనవంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రాథోడ్ సజన్, తుల శ్రీనివాస్, మండల కన్వీనర్ శివారెడ్డి, ప్రతాప్, గులాబ్, గఫ్ఫార్, వైస్ ఎంపీపీ స్వామి, కన్వీనర్ నారాయణ రెడ్డి, చిన్నారెడ్డి, రాంరెడ్డి, గంగారెడ్డి, సాయన్న, శ్రీనివాస్, అర్జున్, వెంకటరమణ, తదితరులు ఉన్నారు.



దొంగలు పగలగొట్టిన షట్టర్



సీసీ కెమెరాలో దొంగతనానికి వచ్చిన వ్యక్తులు

రెండు దుకాణాల్లో చోరీ

కుంటాల, జూలై13 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల కల్లూరు గ్రామంలోని పలు దుకాణాల్లో శనివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. కల్లూరు బస్టాండ్ సమీపంలోని బట్టల దుకాణంతో పాటు మెడికల్‌షాపు షట్టల్ పగలగొట్టి దొంగతనానికి యత్నించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ దొంగతనంలో దుకాణంలో కౌంటర్ పగలగొట్టగా కౌంటర్‌లో ఉన్న చిల్లర డబ్బులను దొంగిలించి దొంగలు పారిపోయినట్లు తెలిపారు. ఆదివారం ఎస్సై అశోక్, సిబ్బంది కలిసి దుకాణాలకు సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ కెమెరాల్లో దొంగల చిత్రాలు నమోదయ్యాయని, కెమెరాలో నమోదైన చిత్రాలను పోలీసులు విడుదల చేశారు.

పోచమ్మ ఆలయంలో బీజేపీ నాయకుల పూజలు

నిర్మల్ రూరల్, జూలై13 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం బోనాల సందర్భంగా అడెల్లి మహాపోచమ్మ ఆలయంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ ఆదివారం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పూజా కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పోడెల్లి చిన్నయ్య, పోడెల్లి గణేష్, వెన్నెల చిన్నయ్య, బండారి ప్రకాష్‌లు పాల్గొన్నారు.



కుభీర్‌లోని మంచి నీటి ట్యాంకు ఇదే..

కుభీర్‌లో బురద నీరు సరఫరా!

● రెండేళ్లుగా ట్యాంకును శుభ్రం చేయించని అధికారులు

కుబీర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కుబీర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మంచినీటి ట్యాంకును గత రెండేళ్ళ శుభ్రం చేయడం లేదని, బురదనీరే సరఫరవతోందని గ్రామస్థులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. ప్రతీరోజు ట్యాంకు నింపి నీరు సరఫరా చేస్తున్నా.. అందులో నీరు ఎలా ఉందోనని పట్టించుకునేవారు కరువయ్యారని ఆరోపిస్తున్నారు. ఈ ట్యాంకు శిథిలావస్థకు చేరి పెచ్చులు ఊడుతూ ఇనుప చువ్వలు తేలుతున్నాయని, దీంతో ట్యాంకు పైకి వెళ్లేందుకు ఎవరూ వెళ్లడం లేదని పంచాయతీ సిబ్బంది చెప్తున్నారు. దుర్వాసనతో నీరు వస్తోందని, ఈ నీటితో స్నానం చేసినా దురద సమస్యలు వస్తున్నాయని గ్రామస్థులు చెప్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

శుభలేఖలు ఇచ్చేందుకు వెళ్తూ అనంత లోకాలకు..

● ఖానాపూర్ శివారులో బైకు అదుపు తప్పి కల్వర్టు కింద పడి ఇద్దరు యువకుల మృతి



లక్ష్మణ్, జశ్వంత్ మృతదేహాలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై



కల్వర్టు పైనుంచి కలువలో పడిన ద్విచక్ర వాహనం

ఖానాపూర, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పెళ్లి అనే బంధంతో మరో ఐదురోజుల్లో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని ఎన్నో కలలు కన్న ఆ యువకుడిని రోడ్డు ప్రమాదం కబలించింది. బంధుమిత్రులకు శుభలేఖలు పంచేందుకు బైకుపై బయల్దేరిన యువకుడు తనతోపాటు ఉన్న బంధువుల ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి కల్వర్టులో పడడంతో ఆ ఇద్దరూ ఒక్కడికక్కడే మృతిచెందారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇంధన్‌పల్లి గ్రామానికి చెందిన చొప్పదండి లక్ష్మణ్(25)కు ఈనెల 18న వివాహం నిశ్చయమైంది. కాగా నిర్మల్ జిల్లాల్లోని పలు గ్రామాల్లో ఉన్న తన బంధుమిత్రులకు శుభలేఖలు పంచేందుకు వరుసకు బావమరిది అయిన మంచిర్యాల జిల్లా మురిమడుగు గ్రామానికి చెందిన జశ్వంత్ (19)ను తోడుగా ఆదివారం ఉదయం ఇంట్లోంచి వెళ్లారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ శివారులోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి సమీపంలో గల ఓ కల్వర్టు వద్ద లక్ష్మణ్, జశ్వంత్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. దీంతో సుమారు 100 మీటర్ల దూరం నుంచి వారి బైక్‌రోడ్డు దిగి అతివేగంతో వెళ్లి కల్వర్టుపై నుంచి కింద పడినట్లు ఆనవాళ్లు కనిపించాయి. సుమారు 10పీట్ల ఎత్తునుంచి ద్విచక్ర వాహనంతో సహా ఎగిరి కల్వర్టు కింద పడడంతో ఈ ఇరువురి యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. ఘటన స్థలాన్ని ఖానాపూర్ సీఐ అజయ్, ఎస్సై రాహుల్ గైక్వాడ్‌లు పరిశీలించారు. మృతదేహాలను ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసునమోదు చేసి విచారణ దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. 18న వివాహం జరగాల్సిన ఇంట్లో విషాదం చోటుచేసుకోవడంతో రెండు కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

బుద్ధుని మార్గంలో నడవాలి

తానూర్, జూలై13 (ఆంధ్రజ్యోతి) : ప్రతీఒక్కరు బుద్ధుడు చూపిన మార్గంలో నడవాలని మండల బౌద్ధ మహాసభ అధ్యక్షులు రమేష్ బాబు అన్నారు. ఆదివారం మండల కేంద్రం తానూర్‌లోని బుద్ధ విహార్‌లో నిర్వహించిన వర్షావాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధిని చిత్రపటానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బౌద్ధమహాసభ నాయకులు అభరావు, సాయినాథ్, ప్రకాష్, నాగరావు, బాపురావు, సంజయ్, పండిత్, బౌద్ధఉపాసకులు పాల్గొన్నారు.



బుద్ధవిహారంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

నిర్మల్ రూరల్, జూలై13 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో శక్తి వంతులుగా ఎదగాలని జోనల్ ఇన్‌చార్జి అల్లూరి కృష్ణవేణి అన్నారు. ఆదివారం ఆదిలాబాద్‌లో జిల్లా ఇన్‌చార్జి కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో మహిళా స్వరాజ్ శక్తి అభియాన్ బూట్ క్యాంప్ నిర్వహించినట్లు తెలిపారు. మహిళలు రాజకీయాల్లో కూడా రాణించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శివలాల్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

● వాహనాలు నడుతుపున్న ముగ్గురి పట్టివేత
● తల్లిదండ్రులకు కౌన్సిలింగ్

నర్సాపూర్ (జి), జూలై 13 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, లేదని ఇస్తే వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామని ఎస్సై గణేష్ అన్నారు. నర్సాపూర్ (జి) పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్సై గణేష్ తన సిబ్బందితో కలిసి చేపట్టిన ఈ డ్రైవ్‌లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్ల ంఘిస్తూ ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ముగ్గురు మైనర్లు పట్టుబడ్డారు. పట్టుబడిన మైనర్లపై పోలీసులు కేసులు నమోదు చేయడంతో పాటు వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడంతో కలిగే ప్రమాదాలను, అలాగే చట్టపరమైన పరిణామాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై గణేష్ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, ఒకవేళ ఇచ్చినట్లయితే మైనర్లతోపాటు వాహన యజమానులపై కూడా చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడపడంతో జరిగే ప్రమాదాలను నివారించడం, ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ స్పెషల్ డ్రైవ్ ప్రధాన ఉద్దేశ్యమని ఆయన స్పష్టం చేశారు. దీనిపై తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ చర్యలు మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టడంలో దోహదపడతాయని ఆశిస్తున్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామరావు పటేల్

నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

కుంటాల, జూలై13(ఆంధ్రజ్యోతి): సీఎంరిలీఫ్ ఫండ్ నిరుపేద ప్రజలకు అండగా మారిందని ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం కుంటాలలో పలు గ్రామాల లబ్ధిదారులకు సీఎం సహాయనిధికింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ నిరుపేద ప్రజలు సీఎం సహాయనిధి పథకాన్ని సద్వినియోపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పసుల నవీన్, మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, రమణ రావు, వెంగల్‌రావు, జక్కుల గజేందర్, బోగ గోవర్ధన్, కళ్యాణి గజేందర్ ఉన్నారు.

ముథోల్‌లో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

ముథోల్: మండలానికి చెందిన 13మంది లబ్ధిదారులకు ఆదివారం ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తన నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. గడిచిన 18 నెలల్లో ముథోల్ నియోజకవర్గంలో 3వేల చెక్కులను అందజేసినట్లు తెలిపారు. తాను ఎమ్మెల్యే అయినప్పటి నుంచి ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ తనవంతు నియోజక వర్గ అభివృద్ధికి పాటుపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కోరి పోతన్న, నాయకులు తాటివార్ రమేష్, జీవన్, సాయినాథ్, తదితరులున్నారు.

భైంసాలో..

భైంసారూరల్: భైంసాలోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం 135 మందికి రూ.42లక్షల చెక్కులను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎంఆర్ఎఫ్ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించానన్నారు. ఇప్పటివరకు 18నెలల కాలంలో 3వేల మందికి రూ.10 కోట్ల సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించామన్నారు.

ప్రజా తీర్పును మాజీ ఎమ్మెల్యేలు గౌరవించాలి

ప్రజలు ఎమ్మెల్యేగా పవార్ రామారావు పటేల్‌కు పట్టం కట్టారని, ప్రజా తీర్పును గౌరవించాల్సిన అవసరం మాజీ ఎమ్మెల్యేలపై ఉందని బీజేపీ మండలాల అధ్యక్షులు లక్ష్మారెడ్డి, నవీన్, సుష్మారెడ్డి, బెల్ తరోడా మాజీ సర్పంచ్ సాయినాథ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లేష్, నాయకులు పండిత్‌రావు, భోజన్న, సుదర్శన్, నియోజకవర్గ కోకన్వీనర్ సుమన్ అన్నారు. సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వారు మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి వైఖరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రోజుకు 18 గంటల పాటు ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ఎమ్మెల్యేని విమర్శిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజక వర్గంలోని అన్నిమండలాల బీజేపీ నాయకులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి

భైంసారూరల్, జూలై13 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను ప్రతీఒక్కరు పాటించాలని సీఐ నైలు అన్నారు. మండలంలోని దేగాం గ్రామ సమీపంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ నైలు యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. 18ఏళ్లు నిండిన వారే వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో భైంసారూరల్ ఎస్సై శంకర్, సుప్రియ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రుయ్యాడిలో అసంపూర్తిగా ఉన్న డబుల్ ఇళ్ల నిర్మాణ పనులు

కలగా మిగిలిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం

● రుయ్యాడిలో 10 సంవత్సరాలుగా పిల్లర్లకే పరిమితం

● పట్టించుకోని అధికారులు

తలమడుగు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయంలో ఇళ్లు లేని నిరుపేదల కోసం ప్రభుత్వం డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణం పథకాన్ని ప్రారంభించింది. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలను మంజూరు చేసినప్పటికీ కొంతమంది అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంతో నిరుపేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయింది. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని రుయ్యాడి గ్రామంలో పదేళ్ల క్రితం ప్రభుత్వం గ్రామానికి 25 ఇళ్లు మంజూరు చేయగా వాటి నిర్మాణ పనులను అధికారులు, కాంట్రాక్టర్ ప్రారంభించారు. కాని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులు బేస్మెంట్, పిల్లర్ల వరకు నిర్మాణం చేపట్టి మధ్యలో నే పనులను నిలిపివేయడంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ ఇళ్ల నిర్మాణం గురించి ఎవరు పట్టించుకోలేదు. మంజూరైన 25 మంది లబ్ధిదారులు పలుమార్లు ప్రజాప్రతినిధులకు అధికారులకు విన్నవించినా ఎవరు పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తం అయ్యాయి. పదేళ్లుగా నిర్మాణం చేపట్టిన పిల్లలకు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుకున్నాయి. కాగా నిర్మాణ సమయంలో స్థలం, డబుల్ బెడ్ రూమ్ నిర్మాణం కోసం లబ్ధిదారులు డబ్బులను ఇచ్చామని తెలిపారు. అయినా నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. కాగా ఇటీవల రుయ్యడీ గ్రామంలో నిర్వహించిన మొహరం పండుగకు జిల్లా కలెక్టర్ రాజార్షిషా రావడంతో గ్రామంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ వాటి వివరాలను సేకరించి పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కలెక్టర్ హామీతోనైనా వారి సొంత ఇంటి కల నెరవేరాలని గ్రామస్థులు కోరుతున్నారు.



డబుల్ బెడ్ రూమ్ నిర్మాణంలో పిచ్చి చెత్తాచెదారం నిండిన దృశ్యం

రోడ్లను ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణాలు

» పట్టించుకోని పంచాయతీ అధికారులు

» ఆగ్రహం వ్యక్తపరుస్తున్న గ్రామస్థులు



మరలపెల్లి గ్రామంలో మురికి కాలువలను ఆక్రమించుకొని నిర్మించిన ఇళ్లు

బోథ్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరలపెల్లి గ్రామంలో ఇందిరమ్మ నిర్మాణం రోడ్లను ఆక్రమించుకొని జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లు గ్రామంలో కాలువలను మిషన్ భగీరథ పైప్ లైన్లను ఆక్రమించుకొని నిర్మిస్తున్నారని పేర్కొంటున్నారు. దీంతో భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే ఆస్కారం ఉందని అంటున్నారు.

● ఎడ్ల బండ్లకు ఇబ్బందులు తప్పవు

గ్రామంలో 90 శాతం వ్యవసాయ కుటుంబాలు జీవిస్తున్నాయి. అయితే వీరంతా వివిధ వ్యవసాయ పనుల నిమిత్తం ఎడ్ల బండను వినియోగిస్తుంటారు. రోడ్లు ఆక్రమించుకొని ఇళ్ల నిర్మాణం జరగడం వల్ల ఎడ్ల బండ్లకు తిప్పలు తప్పదని గ్రామ రైతులు వాపోతున్నారు. మరోవైపు ఇండ్ల నిర్మాణం మురికి కాలువల పైన జరుగుతున్న పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

● అధికారుల దృష్టికి తీసుకువచ్చాం

అక్రమ కట్టడాలపై గ్రామపంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువచ్చామని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఒకరిని చూసి ఇంకొకరు రోడ్డున ఆక్రమించుకొని ఇండ్ల నిర్మాణం చేపడుతున్నారని గ్రామస్తులంటున్నారు. మరోవైపు ఆర్అండ్‌బి రోడ్లను సైతం ఆక్రమించుకొని నిర్మాణం సాగిస్తున్నారని అధికారులు అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.





వెదురు సాగు



ముద్గల్ మోడల్ వెదురు సాగు క్షేత్రం

ఆదాయంలో ఎదురు లేని వెదురు

● వాణిజ్య పంటగా వెదురు సాగు

● 20 ఎకరాలలో సాగు చేస్తున్న ప్రభుత్వం

● ఈ యేడు రైతులకు 10 వేల మొక్కలు తీసుకువచ్చి అందించేందుకు సన్నద్ధం

● తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభం

ముథోల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి మేలు చేస్తూ ఎందరో మందికి జీవనోపాధిని అందించేదిగా వెదురు చెట్లకు ఓ ప్రత్యేకత ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో అయినా, అటవీ గ్రామీణ ప్రాంతాల్లో అయినా ఇది ప్రధాన ఆదాయ వనరు అని చెప్పుకోవచ్చు. ఒక్కసారి మొక్కలు నాటుతే 20 నుంచి 25 ఏళ్ల వరకు పంట దిగుబడులు వస్తుంటాయి. మొక్కలు నాటిన నాలుగు నుంచి ఐదేళ్ల కాలంలో వెదురు దిగుబడులు రైతుకు అందుతాయి. రాష్ట్రంలోనే నిర్మల్ జిల్లాలో నేషనల్ బాంబు మిషన్ కింద పైలట్ ప్రాజెక్టుగా సాగుచేస్తున్న వెదురు కేరళలో సక్సెస్ అయినా మిషన్ బాంబు తరహాలో రాష్ట్రంలోను వెదురు సాగును పెంచేందుకు ఆర్టికల్చర్ డిపార్ట్‌మెంట్ నిర్మల్ జిల్లా ముథోల్ మండలం ముద్గల్ గ్రామ శివారులో గల ప్రభుత్వం ఉద్యానవనంలో 2019-20లో రాష్ట్ర ప్రభుత్వం బాంబు మోడల్ ఫామ్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా రైతులకు అవగాహన కల్పిస్తుంది. 20 ఎకరాల్లో నాలుగు రకాల వెదురు మొక్కలను పెంచుతున్నారు. 2019లో ఏర్పాటు చేసిన ఈ ఫామ్‌లో పెంచిన వెదురు మొక్కలు రైతులకు పంపిణీ చేస్తారు. జిల్లాలోని ముథోల్ మండలం ముద్గల్‌లో వెదురు మోడల్ ఫామ్ 20 ఎకరాలలో 17 వేల మొక్కలు నాటి సాగు చేస్తున్నారు. ఇక్కడ నాలుగు రకాల వెదురు మొక్కలను పెంచుతున్నారు. బాంబుజా తుల్డా, డేండ్రాకెలమాస్ బ్రోన్సి, డేండ్రా కెలమాస్ లాటిఫ్లోరస్, బాంబుజా బాల్కోవా అను రకాల మొక్కలు పెంచుతున్నారు. వీటి సాగులో భాగంగా కోటి పందొమ్మిది లక్షల లీటర్ల నీటి సామర్థ్యం గల రెండు నీటి గుంటలు ఏర్పాటు చేసి ఈ మోడల్ వెదురు సాగును సాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెదురు సాగును ప్రోత్సహించడంతో అధికారులు ఈ సాగుపై రైతులకు ముమ్మరంగా అవగాహన కల్పిస్తున్నారు.

వెదురులో మంచి లాభాలు..

టేకు కలపకు ప్రత్యామ్నాయంగా వెదురు సాగు చేసేలా రైతులకు అధికారులు అవగాహన కల్పించనున్నారు. ఇప్పటి వరకు అడవుల్లో పెరుగుతున్న వెదురును రైతులు తమ భూముల్లో కమర్షియల్ పంటగా సాగు చేసే విధంగా హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ కృషి చేస్తుంది. ఒక్క ఎకరంలో వెదురు సాగు చేసేందుకు 20 నుంచి 20 వేలకు ఖర్చవుతుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో బాంబుకు డిమాండ్ బాగానే ఉంది. ఎకరానికి సుమారు రూ. లక్ష వరకు ఆదాయం వస్తుందని అంటున్నారు. వెదురు చెట్టు మంచిగా 20 నుంచి 25 ఏళ్ల వరకు బతికి ఉంటుందని ఈ పంట సాగు చేస్తే రైతులకు మంచి లాభాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. చీడపీడల సమస్య ఉండదని అగ్నిప్రమాదం నుంచి కాపాడుకుంటే సరిపోతుందని వివరిస్తున్నారు. విదేశాల్లోను వెదురుకు డిమాండ్ ఉండటం వల్ల ఎగుదమతి చేసే అవకాశాలు కూడా ఉంటాయన్నారు.

రైతులకు వెదురు పెంపకంపై అవగాహన కల్పిస్తున్నాం..

- బీవీ రమణ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి



ముద్గల్ బాంబు మోడల్ ఫామ్ సెంటర్‌లో రైతులకు వెదురు సాగు చేసేందుకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ యేడు రైతులకు వివిధ ప్రాంతాల నుంచి 10 వేల మొక్కలను తీసుకువచ్చి అందజేస్తాం. వంద శాతం రా యితీ ఉంది. కాబట్టి రైతులు ఈ పంట సాగు చేసి లాభాలు పొందాలని తెలుపుతున్నాం. వెదురు సాగు చేస్తామని ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలి. తక్కువ ఖర్చుతో సాగయ్యే వెదురు ద్వారా రైతులకు మంచి లాభాలు వస్తాయన్నారు.

రైతు సంతోషమే మా లక్ష్యం

- ఎస్‌కే జావిద్ పాషా, ముథోల్ ఆర్టికల్చర్ అధికారి



రైతుల సంతోషమే మా లక్ష్యం. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందే ఈ వెదురు సాగు ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సహిస్తుంది. కాబట్టి రైతులు ఈ సాగును చేసి అధిక దిగుబడులు పొందాలని మేము క్షేత్రస్థాయిలో వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. రైతులను మోడల్ బాంబు ఫామ్‌కు తీసుకువచ్చి వారికి పంట పెంచే విధానం గురించి కూడా శిక్షణ ఇస్తున్నాం.

ప్రోటోకాల్ పాటించడం లేదని ఎంపీ ఎమ్మెల్యేల గుస్సా

● సమావేశంలో కలెక్టర్ ముందే కడిగిపారేసిన నాయకులు

● అధికార పార్టీలో చర్చ

బోథ్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బోథ్ నియోజకవర్గంలో ప్రోటోకాల్ పాటించకుండా అర్హత లేని వాళ్లు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటూ ఎంపీ ఎమ్మెల్యేలను పిలవడం లేదంటూనే తమ అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో దిశ అభివృద్ధి సమీక్ష సమావేశంలో ఆ ఇద్దరు నేతలు కలెక్టర్ సమక్షంలో అధికారుల తీరును అధికార పార్టీ నాయకుల తీరును కడిగిపారేశారు.

● సమయం కోసం వేచి చూసి..

కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండగా ఎంపీగా జి. నగేష్ వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం, బోథ్ నియోజకవర్గంలో శాసనసభ్యులుగా బీఆర్ఎస్ పార్టీ నుంచి జాదవ్ అనిల్ వ్యవహరిస్తున్నారు. అయితే అధికారంలో ఉన్న నాయకులు అధికారులను తమ చెప్పు చేతుల్లో ఉంచుకొని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆ ఇరువురు నేతల అనుచరులు గతంలో నుండి వాపోతున్నారు. కేంద్రం నుండి వచ్చిన నిధుల పనులను సైతం అధికార పార్టీ నాయకులు తమకు తెలుపకుండానే చేపడుతున్నారని బీజేపీ నాయకులు మదనపడుతూ వస్తున్నారు. వచ్చినవి కేంద్ర నిధులు అయితే షో చేస్తున్నవారు అధికార పార్టీ నాయకులని బిజెపి నాయకులు గతంలో పలుమార్లు విమర్శించడం జరిగింది. ఇక ఎమ్మెల్యేగా ఉన్న జాదవ్ అనిల్ గత కొన్ని రోజులుగా అధికార పార్టీ నాయకుల తీరుతో పాటు వారి వెంట తిరుగుతున్న అధికారుల తీరును పరిశీలిస్తూ వస్తున్నారు. ఆయన అనుచరులు సైతం ఇలాంటి హోదా లేని నాయకులు అభివృద్ధి పనులు పాల్గొంటూ భూమి పూజ చేస్తున్నారంటూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి అసహనం వ్యక్తపరుస్తున్నట్లు సమాచారం. అయితే సమయం కోసం వేచి చూసిన ఈ ఇద్దరు నాయకులు దిశ సమీక్ష సమావేశంలో అధికారుల తీరును అధికార పార్టీ నాయకుల వైఖరి పై కడిగిపారేశారు. జిల్లా కలెక్టర్ సమక్షంలోనే ఎంపీ ఎమ్మెల్యేలు నియోజకవర్గ తీరుపై ఆగ్రహం వ్యక్తపరుస్తూ బోథ్ నియోజకవర్గంలో మండలానికి ఎమ్మెల్యే ఉన్నాడు అంటూ పేర్కొనడం జరిగింది.

● ఇబ్బంది పడుతున్న అధికారులు

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండి కేంద్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉండడం వల్ల కొంతమంది అధికారులు అధికార పార్టీ నాయకులు చెప్పిన విధంగా వ్యవహరించాల్సి వస్తుందని వాపోతున్నారు. తాము వారు చెప్పినట్టు వినకపోతే రాష్ట్రస్థాయి అధికారులు మంత్రుల చేత ఫోన్లు చేయిస్తూ పనులు చేస్తున్నారని ఓ అధికారి వాపోయారు చెప్పినట్లు వినకపోతే తమపై బదిలీ వేటు వేయడంతో పాటు ఇబ్బంది చేస్తారని వాపోతున్నారు. మంజూరి అయిన అభివృద్ధి పనులకు ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే ఉండాలని చెబుతున్న ప్రభుత్వం మాది, నిధులు మావి ఎమ్మెల్యేతో పని ఏంటి అంటూ పేర్కొంటున్నట్లు వాపోతున్నారు.

● కాంగ్రెస్ నేతల మాటలపై చర్చ

దిశ అభివృద్ధి సమీక్షా సమావేశంలో ఎంపీ ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై పరోక్షంగా చర్చించడం కాంగ్రెస్ పార్టీలో చర్చనీ అంశంగా మారింది. మనం అధికారంలో ఉన్నాం అధికారులు మన వెంట ఉంటారు, వాళ్ళు ఎన్ని మాట్లాడితే మనకెందుకు అంటూ కాంగ్రెస్ పార్టీ పై స్థాయి నాయకులు పేర్కొంటున్నట్లు తెలిసింది. అయితే ఇటీవల ఇందిరమ్మ కమిటీల నుండి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను తొలగించడంతో పాటు అభివృద్ధి పనులను సైతం వారికి అందకుండా చేశారన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో ఆ పార్టీ కార్యకర్తలు కొంత నిరాశ నిస్రులకు గురవుతున్న విషయాన్ని గమనించిన ఆయా పార్టీల నాయకులు సమావేశంలో చర్చకు తీసుకు వచ్చినట్లుగా తెలుస్తుంది. ఏదేమైనా ఎంపీ ఎమ్మెల్యేల తీరుపై ఆ పార్టీలో చర్చగా మారింది.



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఎమ్మెల్యేలు (ఫైల్)

అపూర్వం విద్యార్థుల సమ్మేళనం

లోకేశ్వరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): 27 సంవత్సరాల తర్వాత పదవ తరగతి 1997- 98 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అందరూ ఒకచోట కలిసి ఎంతో ఆనందంగా ఆదివారం గడిపారు. ఈ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులందరూ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాట్లాడారు. 27 సంవత్సరాల తర్వాత ఈ కార్యక్రమం చేసుకోవడం గొప్ప సంతోషదాయకమన్నారు. ప్రతిఒక్కరూ ఏదో ఒక స్థాయిలో స్థిరపడ్డందుకు చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారు. వి ద్యార్థులు వారి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరికొకరు మాట్లాడుకుంటూ ఆనందంగా గడిపారు. ప్రతిఒక్కరూ చిన్న పిల్లలుగా మారిపోయి ఎంతో ఆనందంగా గడిపారు.



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

ఫోన్ సిగ్నల్స్ రాక తీవ్ర ఇబ్బందులు

తాంసి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ ప్రతీ ఇంటిలో నిత్యావసర వస్తువుగా మారింది. ఒక పూట అన్నం లేకుండా మనిషి ఉంటున్నాడే మో కానీ ఒక్క నిమిషం చేతిలో ఫోన్ లేకుంటే ఉండలేడు అనడంలో ఎలాం టి సందేహం లేదు. అయితే చాలా గ్రామాల్లో సరైన సిగ్నల్స్ రాక సెల్‌ఫోన్ వాడకం దారుల ఇబ్బందులు అంతా ఇంతా కావు. ముఖ్యంగా తాంసి మండలంలోని గిరిగావ్, అట్నం గూడా, లింబు గూడా, అంబుగావ్ గ్రామాలలో గత పక్షం రోజుల నుంచి జియో గాని, బిఎస్ఎన్ఎల్ టవర్స్‌లు పనిచేయడం లేవు. దీంతో ఏ చిన్న ఫోన్ కాల్ చేయాలన్న అక్కడి ప్రజలు చెట్లను ఎక్కి, లేక వాటర్ ట్యాంకులను ఎక్కి ఫోన్ చేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని అంటున్నారు. బిఎస్ఎన్ఎల్ టవర్‌ను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. జియో టవర్ ఉన్నప్పటికీ సరైన సిగ్నల్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫోన్ వినియోగించుకోవాలంటే తమకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని అంటున్నారు. వెంటనే సిగ్నల్స్ సరిచేయాలని పలువురు గిరిజన గ్రామ ప్రజలు కోరుతున్నారు.

సల్లంగ చూడు తల్లి

● పోచమ్మ ఆలయాలకు పోటెత్తిన భక్తులు

● ఆలయాల వద్ద సందడి

● ఊరూరా పండుగ వాతావరణం

ఆదిలాబాద్ అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఏడాదిలో ఆషాఢ మాసంలో ఒకేసారి వచ్చే బోనాల పండుగను ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఊరూ రా పల్లెపల్లెనా ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రజలందరిని సల్లంగా చూడాలని పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఉదయం నుంచే భక్తులు తమ ఇళ్లలో పిండి వంటలు చేసి భక్తి శ్రద్ధలతో బోనాలను నెత్తిన ఎత్తుకొని పోచ్చమ్మ ఆలయాలకు బారులు తీరారు. దీంతో ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. ఆలయంలో పోచ్చమ్మ తల్లికి మహిళా భక్తులు బోనాలను సమర్పిస్తే, పురుషులు పోచమ్మ తల్లికి యాటలతో మొక్కులు తీర్చుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అశోక్‌రోడ్ పోచ్చమ్మ ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వేపాకులు, బండారితో తల్లికి పూజలు చేశారు. అటు మహలక్ష్మీ వాడలో, డైట్ కళాశాల మైదానంలోని, ఊరూరా పోచమ్మ తల్లికి పెద్ద ఎత్తున బోనాలు వేసి పండుగను జరుపుకున్నారు. దీంతో ఆలయాల వద్ద భక్తులతో సం దడి నెలకొనగా పండగ వాతావరణం కనిపించింది. అటు తాటిగూడలో పెద్ద ఎత్తున నిర్వహించిన బోనాల పండుగలో కాలనీ వాసులు, భక్తులు పొచమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా బోనాల పండుగ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పురాతన పొచమ్మ తల్లి ఆలయం, శ్రీ మహలక్ష్మి ఆలయాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు జిల్లా ఎస్పీని ఘనంగా సత్కరించి ప్రసాదాలు అందజేశారు. జిల్లా ప్రజలకు ఎస్పీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని 13వ వార్డు కాలనీ వాసులు సామూహిక బోనాల పండుగను డప్పు చప్పుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్ష కార్యదర్శులు కొప్పులదేవిదాస్ ప్రేమ్‌సింగ్‌లు మాట్లాడుతూ ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని, ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా కాలనీ వాసులందరు కలిసి బోనం తీసుకెళ్లి పండుగ వాతావరణంలా జరుపుకోవడం జరిగిందని తెలిపారు. ఇందులో చందాగణేష్, అనిల్‌కుమార్, భోజారెడ్డి, కృష్ణనాయక్ తదితరులున్నారు.



మహలక్ష్మీవాడలో పూజలందుకుంటున్న పోచ్చమ్మ తల్లి



బోనాల కుండలతో పొచమ్మ ఆలయానికి వస్తున్న మహిళలు, కాలనీ వాసులు





లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తానూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తానూర్‌కు చెందిన దర్శోడ్ గంగాధర్ ఇటీవల అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్సలు పొందగా సీఎం సహాయనిధి దరఖాస్తు చేసుకున్నారు. కాగా సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, మాజీ జెడ్పీటీసీ ఉత్తం బాలేరావు, మాజీ ఆత్మచైర్మన్ పోతారెడ్డి, మాజీ సర్పంచ్ నందిగావ్ షేక్ అబ్దుల్ కరీం, తదితరులు ఉన్నారు.




చెట్టుకు రెక్కలు!

దిలావర్‌పూర్‌లో గల 61వ జాతీయ రహదారి పక్కన పెరుగుతున్న ఓ చెట్టు చూపరులను ఆకర్షిస్తోంది. చెట్టుతో పాటు ఇరువైపులా కొమ్మలకు ఓ తీగ జాతి మొక్క అల్లుకోవడంతో చెట్టుకు రెక్కలొచ్చాయా అన్నట్టు కనువిందు చేస్తోంది. కొందరు సరదాగా.. సీతాకోక చిలుక చెట్టు అని పిలుస్తూ మురిసిపోతున్నారు.

• ఆంధ్రజ్యోతి, దిలావర్‌పూర్

బాసరపై పార్టీల మూడుముక్కలాట!



- అమ్మవారి ఆలయాభివృద్ధిపై పార్టీల నేతల ఒకరిపై ఒకరి విమర్శలు
- ఆర్భాటాలు తప్ప చేసింది శూన్యం
- సమైక్య రాష్ట్రంతో పాటు ప్రత్యేక రాష్ట్రంలో అభివృద్ధికి నోచుకోని క్షేత్రం

బాసర పుణ్యక్షేత్రం రాజకీయ విమర్శలకు వేదికైంది. బాసర అభివృద్ధిపై అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీల నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. శనివారం దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, కార్మికశాఖమంత్రి వివేక్ సమక్షంలో బాసరను విస్మరిస్తే.. భిక్షమెత్తి అభివృద్ధి చేస్తానని స్థానిక బీజేపీ ఎమ్మెల్యే రామారావు పటేల్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారింది.

బాసర, జూలై13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధి టెంపుల్ టూరిజం పథకం (ప్రసాద్) బాసరకు నిధులను మంజూరుచేసి అభివృద్ధి చేయాలనే వాదన కాంగ్రెస్ నాయకులు, స్థానికుల నుంచి విన్పిస్తోంది. ఇక గత పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ బాసర అభివృద్ధి హామీలు తప్ప అభివృద్ధి చేసింది శూన్యమనే చెప్పొచ్చు. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పార్టీ యాదాద్రితోపాటు అనేక పుణ్యక్షేత్రాలను ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేసింది. సాక్షత్తు దేవాదాయశాఖమంత్రి పదేళ్లపాటు బాసర వెనుకబాటుకు గురైంది. ఇలా మూడు పార్టీలు బాసర అభివృద్ధిపై ఎదురుగా ఉన్న పార్టీలపై విమర్శిస్తున్నారే.. తప్ప బాసరకు చేసింది జీరో అనే చెప్పొచ్చు.

పదేళ్లు ఉదరగొట్టి..

ప్రత్యేకరాష్ట్రం తర్వాత జిల్లాకు చెందిన వ్యక్తి దేవాదాయశాఖ మంత్రి అయ్యారు. ఇక అందరూ రాష్ట్రంలోనే ప్రధాన దేవాలయాల్లో ఒకటైన బాసర సరస్వతీ అమ్మవారి క్షేత్రానికి మంచి రోజులు వచ్చాయని అనుకున్నారు. సొంత జిల్లా మంత్రిపై ఆశలు ఆకాశన్నంటాయి. అనుకున్నట్లుగానే మంత్రిగా బాధ్యతలు చేపట్టి బాసర అమ్మవారి దర్శనం తర్వాత జిల్లా పర్యటన మొదలుపెట్టిన ఆయన అమ్మవారి సాక్షిగా బాసరకు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బాసరకు తెచ్చిక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత అనేకసార్లు ఇలాంటి హామీలు ఇచ్చిన విషయం స్థానికులకు, జిల్లా వాసులకు తెలిసిందే. అనేక వేదికలపై బాసర వచ్చిన ప్రతీసారి ప్రచారం తప్ప పనులు మాత్రం జరిగింది లేదు. 2018లో ఆదిలాబాద్ సభలో అప్పటి సీఎం సీఎం కేసీఆర్ బాసరను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు. హామీ మేరకు 2019లో రూ.50కోట్లు బాసరకు మంజూరు చేశారు. నిధులను మంజూరైనా పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. అనుమతులు తెప్పించుకునే విషయంలో దేవాదాయశాఖ మంత్రిగా ఉన్న ఇంద్రకరణ్‌రెడ్డి అప్పటి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి విఫలమయ్యారనే విమర్శ ఇప్పటికీ స్థానికుల్లో వ్యక్తమవుతూ ఉంది. మంజూరైన రూ.50 కోట్ల నిధులలో రూ.8కోట్ల నిధులను అమ్మవారి లయం వద్ద మరమ్మత్తు, ఆధునీకరణ పనులకు ఖర్చు చేయగా.. రూ.42 కోట్ల నిధులు మిగిలిపోయాయి. గతేడాది మార్చి 24వ తేదీన అప్పటి దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తదితరులు అమ్మవారి ఆలయ పునర్నిర్మాణం కోసం భూమిపూజ చేసినా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు.

రూ. 42 కోట్లు ఊడ్చేశారు.

2014లో అధికారంలోకి వచ్చినన కాంగ్రెస్ పార్టీ జిల్లాల్లోఉన్న మిగులు నిధులపై దృష్టి పెట్టింది. అలాంటి నిధులకు సంబంధించిన పనులను రద్దుచేసి ఆ నిధులను వెనక్కి తీసుకుంది. ఇలా కలెక్టర్ అకౌంట్‌లో ఉన్న బాసర అభివృద్ధి నిధులు రూ.42కోట్లు ఈ ప్రభుత్వం లాగేసుకుంది. దీంతో బాసర పరిస్థితి ములిగే నక్కపై తాటికాయపడ్డట్లైంది. వచ్చిన నిధులు తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై స్థానికుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. కొత్తవి లేకపోయినా సరే.. తీసుకున్న రూ.42కోట్ల నిధులను ఇవ్వాలని డిమాండ్ పెరిగిపోయింది. మొన్నటి వరకు ఉన్న జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కతో పాటు బాసరకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి స్థానికులు వెనక్కి వెళ్లిన నిధుల కోసం విన్నవించుకున్నారు. ఈ నిధుల విషయమై ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అసెంబ్లీ సాక్షిగా రెండు, మూడుసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. రెండేళ్ల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇస్తోంది తప్ప తీసుకున్న రూ.42కోట్ల నిధులను మంజూరు చేయడం లేదు. బాసర మాస్టర్‌ప్లాన్ ప్రణాళిక సమీక్షకు వచ్చిన మంత్రులు సైతం రూ.42కోట్ల విషయంలో నిర్దిష్ట హామీ దొరకలేదు.



తాజాగా బాసర అభివృద్ధిపై సమీక్షలో మంత్రులు కొండా సురేఖ, వివేక్



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి బాసర మాస్టర్ ప్లాన్‌ను చూపిస్తున్న దేవస్థాన అధికారులు

అందని ప్రసాదం

దేశంలో ఆలయాల అభివృద్ధి, టెంపుల్ టూరిజం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీంను అమలు చేస్తోంది. ఒక్కో ప్రదేశానికి అభివృద్ధి కోసం రూ.50కోట్ల వరకు మంజూరు చేస్తూ వచ్చింది. రాష్ట్రంలో కూడా వివిధ దేవాలయాలు ఈ పథకానికి ఎంపికయ్యాయి. ప్రభుత్వం నుంచి అభివృద్ధి జరుగకపోవడంతో దేవస్థాన అధికారులు, పండితులు బీజేపీ నాయకులకు ప్రసాద్ స్కీం కింద బాసరను ఎంపిక చేయాలని విన్నవిస్తూ వస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కూడా నాలుగేళ్ల కిందట ప్రసాద్ స్కీం గురించి దేవస్థాన అధికారులు, వైదిక సిబ్బంది వినతిపత్రం ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన ఒకటి, రెండేళ్లను మంత్రి నియోజకవర్గంలో గల బల్కంపేట ఎల్లమ్మ ప్రసాద్ స్కీం కింద ఎంపికైనా దేశంలోనే రెండో ప్రాచీన సరస్వతీ దేవాలయంగా వీరాజిల్లుతున్న బాసరకు మోక్షం లభించలేదు. ఉమ్మడి జిల్లాలో నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలు, ఒకరు ఎంపీగా ఇక్కడి ప్రాంతవాసులు ఎన్నుకున్నారు. వీరందరూ ప్రయత్నిస్తే ప్రసాద్ స్కీం కింద బాసర ఎంపిక కావడం పెద్ద పని కాదని స్థానికులు భావిస్తున్నారు.

హామీలు తప్ప చేసింది శూన్యం

• ధనుంజయ్‌రావు, బాసర



సరస్వతీ అమ్మవారి ఆలయం వద్ద కనీస వసతులు, సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. అభివృద్ధి చేస్తామంటూ.. అన్ని పార్టీలు, రాజకీయ నాయకులు హామీలు ఇస్తున్నారు. తప్ప పనులు మాత్రం చేసింది శూన్యం.

రూ.42కోట్లు మంజూరు చేయాలి

• రవి, బాసర



ప్రభుత్వం రూ.42 కోట్లను విడుదల చేయాలి. కొత్తగా నిధులు ఇవ్వకున్నా తీసుకున్నవి అందిస్తే అమ్మవారి క్షేత్ర అభివృద్ధి పనులు ప్రారంభించే అవకాశముంది. ప్రభుత్వం చర్యలు తీసుకుంటే పుష్కరాల కంటే ముందుగానే ఇస్తే పనులు పూర్తి చేసుకోవచ్చు.

మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్

- ఎస్పీ జానకీ షర్మిల • 54 వాహనాలు సీజ్
- మైనర్ తల్లిదండ్రులను కలిపి 68 మందికి కౌన్సిలింగ్

నిర్మల్‌రూరల్, జూలై13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యల్లో భాగంగా ఆదివారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ఎస్పీ జానకీ షర్మిల తెలిపారు. ఈ డ్రైవ్‌లో మొత్తం 54 మైనర్ డ్రైవింగ్ వాహనాలు సీజ్ చేసినట్లు తెలిపారు. మైనర్లు వారి తల్లిదండ్రులు కలిపి మొత్తం 68మందికి సంబంధిత స్టేషన్ ఎస్‌హెచ్‌వోలు స్థానికంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం మైనర్ల వాహన నిర్వహణకు వాహన యజమాని (తల్లిదండ్రుల)దే బాధ్యత అని ఎస్‌హెచ్‌వోలు హెచ్చరించారు. పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు తల్లిదండ్రులు పూర్తి బాధ్యతను తీసుకోవాలని వారు సూచించారు. ఇది వరకు 70 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు కాగా, మైనర్లు వారి తల్లిదండ్రులు కలుపుకొని 107 మందికి కౌనిల్సింగ్ ఇచ్చారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్లు, అన్ని స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.

సారంగాపూర్‌లో గ్రామ దేవతలకు పూజలు

సారంగాపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు అడెల్లి గ్రామాల్లో మహిళలు ఆదివారం గ్రామ దేవతలకు పూజలు చేశారు. ఈ నేపథ్యంలో మహిళలు నూతన వస్త్రాలను ధరించి డప్పు మేళాల మధ్య వీధుల లో ఊరేగింపుగా వెళ్లి గంగనీళ్లతో గ్రామాల మధ్య విధులలో ఊరేగింపు వెళ్లి గంగనీళ్లతో గ్రామ దేవతలను శుభ్రపరిచి మొక్కులను మొక్కి ఏడాదిపాటు గ్రామస్తులందరూ సుఖసంతోషాలతోపాటు ఉండాలని దేవతలను వేడుకున్నారు. అలాగే మండల కేంద్రం నుంచి అడెల్లి పోచమ్మ దేవాలయం వరకు డప్పు మేళాలతో 3కి.మీపాటు వెళ్లి అమ్మవారి మొక్కులను మొక్కి అమ్మవారికి పెరగన్నాన్ని నైవేద్యంగా సమర్పించి సహపంక్తి భోజనాలను చేశారు.



డప్పుమేళాల మధ్య అడెల్లి ఆలయం వరకు నడుచుకుంటూ వెళ్తున్న గ్రామస్థులు

బీసీ రిజర్వేషన్లపై కేబినెట్ ఆమోదం పట్ల సంబరాలు

- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఖానాపూర్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై కేబినెట్ ఆమోదంపై ఖానాపూర్‌లోని ఎన్టీఆర్ చౌక్‌లో ఆదివారం ఖానాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మాజీద్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజుర సత్యం మాట్లాడుతూ తెలంగాణ బీసీ సామాజిక వర్గాలకు 42శాతం రిజర్వేషన్లను ప్రకటించిన నేపథ్యంలో బీసీలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. బీసీల సంక్షేమానికి దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న రిజర్వేషన్ల అంశంపై తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేసిందని కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కావలి సంతోష్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, మైనార్టీ మండల పట్టణ అధ్యక్షుడు సలీమ్ ఖాన్, షౌకత్ పాషా, జిల్లా నాయకులు శ్యామ్మోహన్ రావు, జన్నారపు శంకర్, గొర్రె గంగాధర్, మణిచరణ్, కంటం రవి, మిర్జా బేగ్, శేషాద్రి, కొండ నారాయణ, సజ్జు, షారు, ఎల్. రమేష్, తదితరులున్నారు.



సీఎం సహా మంత్రుల ఫ్లెకీకి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తీన్మార్ మల్లన్న కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నాం..

- దాడి చేసినవారిని అరెస్టుచేసి శిక్షించాలి: బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు

నిర్మల్ రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : బీసీల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్)పైనా, అతని కార్యాలయంపైనా జరిగిన దాడిని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ ఖండించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బీసీల ప్రతినిధిగా తెలంగాణ రాష్ట్రంలో నిస్వార్థంగా పనిచేస్తున్న తీన్మార్ మల్లన్నపై దుండగులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీన్ని యావత్ బీసీ సమాజంపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని, ఈ దాడి వెనకున్న సూత్రధారులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే దాడి ఘటనకు సూత్రధారులు, పాత్రధారులను కఠినంగా శిక్షించాలని, తీన్మార్ మల్లన్నకు తగిన భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.



భక్తులతో జాతకం సరిచూసుకుంటున్న భక్తులు

పోచమ్మ తల్లీ.. దీవించమ్మా!

సారంగాపూర్, జూలై 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడెల్లి పోచమ్మ దేవాలయంలో ఆదివారం భక్తులు పోచమ్మ తల్లీ.. దీవించమ్మా అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఆలయానికి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల నుండే కాకుండా మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. పెరగన్నానన్ని నైవేద్యంగా సమర్పించారు. మొక్కులను తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోంకుండా ఉండడానికి ఆలయ ఇన్‌చార్జీ ఈవో రమేష్ అన్నిఏర్పాట్లు చేశారు. అలాగే ఆలయం వద్ద తాగునీటి ఏద్దడి లేకుండా చర్యలు తీసుకున్నారు. నిర్మల్, భైంసా డిపోల నుంచి అధిక సంఖ్యలో బస్సు సౌకర్యాలను కల్పించారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉంటేనే ప్రభుత్వ బడులు బలోపేతం



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి గోనెల శశిరాజ్

నిర్మల్‌రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉంటేనే ప్రభుత్వ బడులపై నమ్మకం పెరుగుతుందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్రకార్యవర్గ సభ్యులు, జిల్లా ఇన్‌చార్జి గోనెల శశిరాజ్ అన్నారు. ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక సంఘ భవనంలో నిర్వహించారు. ఇటీవల కాలంలో ప్రభుత్వం విద్యాశాఖను పటిష్ఠం చేయడానికి పర్యవేక్షణ విద్యాప్రమాణాల పెంపుపై సమీక్షలు వంటి చర్యలు చేపట్టినా గణనీయంగా ప్రభుత్వ పాఠశాలలో రిటైర్మెంట్ రూపంలో ఖాళీలు ఏర్పడుతున్నాయన్నారు. ఆయా స్థానాల్లో సంబంధిత విషయ నిపుణులను, ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడంలో విద్యాశాఖ విఫలం అవుతోందన్నారు. దీంతో ప్రభుత్వ బడులపైనా, విద్యారంగంపైనా ప్రభావం పడి విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. విద్యాశాఖ అధికారి, యంత్రాంగం తక్షణమే ఖాళీలు ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుల సర్దుబాటు చేసి ప్రభుత్వ బడులను బలోపేతం చేసే దిశగా ప్రయత్నాలు చేయాలని కోరారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులను స్థానికత ఆధారంగా కేటాయింపులు చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్, జిల్లా నాయకులు జి. రాజేశ్వర్, అశోక్, తదితరులున్నారు.

గ్రామ దేవతలకు గంగనీళ్లతో అభిషేకం



గడముంతలతో గోదావరికి బయలుదేరుతున్న గ్రామస్థులు

దిలావర్‌పూర్, జూలై13 (ఆంధ్రజ్యోతి): మండంలోని న్యూలోలం గ్రామస్థులు ఆదివారం గ్రామ దేవతలకు భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం ఉదయం గ్రామస్థులందరూ గడ ముంతలు తీసుకుని డప్పు చప్పుళ్ల, బాజాభజంత్రీలతో గంగమ్మ (గోదావరి నదీమ తల్లి) చెంతకు బయలు దేరారు. అక్కడ పవిత్ర స్నానాలు చేసి గోదావరి నదీమ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గడ ముంతల్లో నీరు తీసుకుని తిరిగి గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలోని గ్రామ దేవతలను ఆ గోదారమ్మ పవిత్ర జలాలతో అభిషేకంచారు. సమృద్ధిగా వర్షాలు కురిపించి పాడి పంట, అందరూ సల్లంగా ఉండాలని మొక్కుకున్నారు. అనంతరం గ్రామస్థులందరూ కలిసి విందు భోజనాలు చేశారు.

ఘనంగా బోనాల పండుగ

- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు



అమ్మవారి బోనాలతో వెళ్తున్న మహిళలు, చిన్నారులు

నిర్మల్‌రూరల్, జూలై13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగలు ఆదివారం మండలంలోని కొండాపూర్, అక్కాపూర్, వెంకటాపూర్, మేడిపల్లి తదితర గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో బోనాల ఊరేగింపు సందర్భంగా పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ప్రతీ సంవత్సరం ఆషాఢ మాసంలో వర్షాలు కురిసి ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకుంటారు. పట్టణంలోని బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయంలో ప్రత్యేక ఆకర్షణగా అమ్మవారి మట్టి ప్రతిమ అనంతపేట గ్రామానికి చెందిన పర్యావరణ కళాకారులు పోలీస్ భీమేష్ మట్టితో తయారు చేసిన అమ్మవారి పాతమూల విరాట్ విగ్రహం పోలిన ఈ ప్రతిమ గర్భగుడిలో ప్రత్యేక ఆకర్షణగా ఆకట్టుకుంటుందని భక్తులు అన్నారు.



కుంటాలలో బోనాల ఊరేగింపులో ఎమ్మెల్యే, మహిళలు

బాసరలో బోనాల పండుగ

బాసర: బాసర మండల కేంద్రంలోని హంసవాహిని విద్యాలయంలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ వస్త్రాలు ధరించి పండుగ వేడకల్లో పాల్గొన్నారు. బోనాలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు పూజలు చేసే సాంప్రదాయ విధానం విద్యార్థులకు తెలిసేలా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓంకార్ దేశాయ్, ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.



బోనాలతో వెళ్తున్న చిన్నారులు

కుంటాలలో..

కుంటాల: కుంటాలలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మీ ఆలయ నిర్మాణదాత జనగామ ఆర్టీవో శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం కుంటాలలో శ్రీ మహాలక్ష్మీ, ముత్యాలమ్మతోపాటు పలు గ్రామదేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే రామరావు పటేల్ పాల్గొని బోనం ఎత్తి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ బోనాలను గ్రామప్రధాన వీధుల గుండా గజ్జలమ్మ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులు అప్క గజ్జారాం యాదవ్, రమణరావు, విశ్రాంత ఉద్యోగి రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

యాదవ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన యాదవ ఉద్యోగఉపాధ్యాయ సంక్షేమ సంఘ సభ్యులు

నిర్మల్‌రూరల్, జూలై13 (ఆంధ్రజ్యోతి): యాదవ ఉద్యోగ ఉపాధ్యాయ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు భాస్కర్ తెలిపారు. ఆదిలాబాద్ స్థానిక టీఎన్జీవోస్ భవన్‌లో ఏర్పాటుచేసిన యాదవ ఉద్యోగ ఉపాధ్యాయ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు.